

విత్తనాలు చల్లుతున్న రైతు



ట్రాక్టర్ సహాయంతో దుక్కు ..



పత్తి విత్తనాలు నాటుతున్న రైతులు



పొలం చదును చేస్తున్న గిరిజన రైతులు

ఖరీఫ్ సాగుకు సమాయత్తం..

తొలకరి పులకరించింది. అడపా, దడపా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. కొద్ది రోజులుగా వరి నారుమడులను సిద్ధం చేసే పనిలో రైతన్నలు బిజీగా ఉన్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు చల్లుకోవడం వంటి పనుల్లో తలమునకలై ఉన్నారు. అలాగే పత్తి పంట సాగుకు అన్నదాతలు గట్లు చదును చేయడం, గొప్పులు తవ్వడం వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. – మక్కువ

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం 11 కేవీ ద్వారా విద్యుత్ సరఫరా జరిగే గ్రామాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వచ్చే నెల 7న మాదిగ మహామేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, మాదిగ నాయకులు

బలిజిపేట: వచ్చే నెల 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాదిగ మహామేళాను విజయవంతం చేయాలని మాదిగ మహామేళా రాష్ట్ర కో కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు మాదిగ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మహామేళాకు సంబంధిన వాల్‌పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహామేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కో రారు. కార్యక్రమంలో బి.రామారావు మాదిగ, మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగుపాము హల్‌చల్..



కోడిగుడ్లు మింగిన నాగుపాము, పక్కనే మృతి చెందిన కోడి

పార్వతీపురం రూరల్: మండల పరిధి పెదబొండపల్లిలోని ఓ ఇంటిలో నాగుపాము హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన ఎం. పార్వతి ఇంటిలో ఉన్న కోళ్ల గూడులోకి నాగుపాము దూరి కోడిగుడ్లను మింగేయడంతో పాటు తల్లికోడిని కాటేసింది. ఆదివారం వేకువజామున కోడిని వదిలేందుకు పార్వతి గంప ఎత్తగా పాము బుసలు కొడుతూ మీదకు వచ్చింది. వెంటనే అప్రమత్తమైన పార్వతి పక్కకు జరిగి స్థానికులకు విషయం తెలియజేయగా.. వారు వచ్చి పామును బయటకు తీశారు.

పాలమెట్ట ఓపెన్ హెడ్ చానల్ అభివృద్ధి చేస్తాం

వీరఘట్టం: పాలమెట్ట-నీలానగరం ఓపెన్ హెడ్ చానల్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హామీ ఇచ్చారు. మండలంలోని నీలానగరంలో ఆదివారం జరిగిన ఓ సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. రూ.11 లక్షల ఓ అండ్ ఎం నిధులతో ఈ చానల్‌ను ఇటీవల బాగుచేశామని గుర్తు చేశారు. ఇదే చానల్ ద్వారా 2200 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామన్నారు.

బాక్సైట్ కొల్లగొట్టేందుకు సన్నాహాలు

గుమ్మలక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, అనంతగిరి, అరకు తదితర ప్రాంతాల్లోని విలువైన బాక్సైట్ ఖనిజాన్ని కొల్లగొట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం ఆరోపించారు. జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థ(ఎన్‌ఎండీసీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ(ఏపీ ఎండీసీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బాక్సైట్‌ను తవ్వి తీసి తరలించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

స్మార్ట్‌మీటర్లపై ఆందోళన

- ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు
- ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరిగే అవకాశం
- మీటర్లను రద్దు చేయాలి : సీపీఎం నాయకులు



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మీటర్‌ను చూపిస్తున్న సీపీఎం నాయకులు



కాలిపోతున్న స్మార్ట్‌మీటర్

పార్వతీపురం రూరల్: ఇటీవల విద్యుత్‌శాఖాధికారులు ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గతంలో కంటే ఈ మీటర్లు అమర్చిన అనంతరం ఎక్కువ మొత్తంలో బిల్లులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అలాగే పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఇటీవల మూడు రోజుల వ్యవధిలో రెండుచోట్ల మీటర్లు దగ్ధమవడంతో వినియోగదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రజలపై ప్రయోగాలు చేయకుండా సరైన అధ్యయనం చేసిన అనంతరమే అమర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

రద్దు చేయాలి



గతంలో టీడీపీ నాయకులు వ్యతిరేకించిన స్మార్ట్ మీటర్లనే మళ్లీ ప్రజలకు అంటగట్టడం దుర్మార్గమైన చర్య. ఈ మీటర్ల వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదు. బిల్లులు అధికంగా రావడమే కాకుండా అత్యంత నాశిరకంగా ఉంటున్నాయి. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గతంలో ఈ మీటర్లు బిగిస్తే బద్దలుగొట్టమని పిలుపునిచ్చిన నారా లోకేష్ ఇప్పుడేమి సమాధానం చెబుతారు. స్మార్ట్‌మీటర్లు ఆదాని కంపెనీకి చెందినవి. ఒక్కో మీటర్ ఖరీదు రూ. 28 వేలు కాగా.. ఈ మొత్తం వినియోగదారిడిపై వేయడం సరి కాదు. మీటర్లను రద్దు చేయకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన తప్పదు.

– బీవీ రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సమ్మెను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మక్కువ: వచ్చే నెల 9వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై. నాయుడు పిలుపునిచ్చారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై పనిభారం పెంచుతున్నాయని ఆరోపించారు. కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే విధంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కోట్లాది మంది కార్మికులకు కనీస వేతనాలు మంజూరు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ఎల్.దాలమ్మ, మరిపి రూపావతి, బొత్స సత్యనారాయణ, ఎస్.కల్యాణి, లక్ష్మి, పృథ్వి ఉన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు..

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న బక్కుపేట వాసులు



అధ్వానంగా ఉన్న బక్కుపేట బీటీ రోడ్డు



కోతకు గురైన రహదారి

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. పూర్తిగా గోతులతో దర్శనమిస్తున్నా అధికారులు గాని పాలకులు గాని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ గ్రామానికి గతంలో రహదారి సౌకర్య లేదు. ఒకసారి డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలడంతో రాకపోకలకు సులువుగా ఉండేందుకు అప్పటి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డు నిర్మించింది. మండలానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో ప్రజలు ఎంతో సంతోషించారు. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. ప్రస్తుతం ఆ రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. ఐదు కిలోమీటర్ల మేర గోతులేర్పడడం, కోతకు గురవ్వడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవేళ చినుకులు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కొప్పల వెలమల అభివృద్ధికి కృషి చేయాలి

- సంఘ గౌరవాధ్యక్షుడు చుక్క భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ గౌరవ అధ్యక్షుడు చుక్క భాస్కరరావు

పార్వతీపురం: కొప్పల వెలమ సంఘ అభివృద్ధికి ప్రతిఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు చుక్క భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీఎస్‌ఎన్ వేదికలో జిల్లా అధ్యక్షుడు చల్లారపు రమేష్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో కొప్పల వెలమ సంఘ భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 35 శాతానికి పైగా ఉన్న కొప్పల వెలమలకు రాజకీయ ప్రాధాన్యం పూర్తిగా కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి సంఘ అభివృద్ధికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కొప్పల వెలమలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కొప్పల వెలమ సంఘ రాష్ట్ర డైరెక్టర్లు గొట్టాపు వెంకటనాయుడు, అక్కేన మధుసూదనరావు, కొల్లి అప్పలనాయుడుతో పాటు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, చుక్క జయప్రకాష్, చొక్కాపు వెంకటరమణ, పి.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలి

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపిందని సీపీఎం నాయకులు డి. రమణారావు, కె.రాము విమర్శించారు. ఇదే విషయమై వారు స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఏకంగా రెండు మూడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచేశారని గుర్తు చేశారు. దీనికితోడు స్మార్ట్ మీటర్లు వద్దంటే విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజాధనం దోపిడీకి సిద్ధమవుతున్నారన్నారు. రైతుల మోటార్లకు స్మార్టుమీటర్లు బిగిస్తే వాటిని విసిరికొట్టమని చెప్పిన మంత్రి లోకేష్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు చేయరాదని హితవుపలికారు.

శ్రమదానం

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న పిచ్చిమొక్కలను వీఆర్‌ఏలు శ్రమదానం చేసి ఆదివారం తొలగించారు. ఏపుగా పెరిగిన మొక్కలతో కార్యాలయం ఆవరణ అంతా అపరిశుభ్రంగా దర్శనమివ్వడంతో తహసీల్దారు వై.జయలక్ష్మి ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రత చేపట్టినట్లు వీఆర్‌ఏలు తెలిపారు.

వరి సాగులో..

యాజమాన్య పద్ధతులే మేలు!

- పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- సమయం, పెట్టుబడులు ఆదా
- నాణ్యమైన పంట దిగుబడి, భూసారానికి ఆస్కారం
- ఖరీఫ్ సీజన్ వేళ వ్యవసాయ నిపుణుల సూచన



రైతులు సిద్ధం చేసిన నారుమడులు

పాలకొండ రూరల్: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు, పురుగుమందుల వాడకంతో పాటు నీటి యాజమాన్యంలో మెలకువలు పాటిస్తే ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంట వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులంతా పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సాగు తొలినాళ్ల నుంచి జాగ్రత్త వహిస్తూ పంటలు పండించుకుంటే వ్యవసాయాన్ని లాభదాయకం చేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. వరి పంట పండించేందుకు ఆమ్ల, క్షార, చౌడు నేలలు మినహా మిగతా అన్ని నేలలూ సేద్యానికి అనుకూలమే. దుబ్బ, కారు, చౌడు నేలలో పంటకు నీరు అధికంగా కావాల్సి ఉంటుంది. అలాంటి నేలల్లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు.

విత్తనాలు తడిపి ఆరబెట్టుకోవాలి..

నియోజకవర్గంలోని రైతులంతా 1064, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1121(శ్రీధృతి), ఎంటీయూ 7029(స్వర్ణ), బీపీటీ 5204(సాంబమసూరి) రకాల విత్తనాలను సాగుకు తీసుకువెళ్లారు. ఎకరానికి సరాసరిన 20 నుంచి 25 కిలోల విత్తనాలు.. నారు వేసేందుకు సరిపోతుంది. అయితే వాటిని విత్తుకునే ముందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజం కలిపి తడిపి ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత సిద్ధం చేసిన నారుమడిలో వేసుకోవాలి. జూలై 15వ తేదీ వరకు నారు పోసుకోవచ్చు. ఆగస్టు చివరి వరకు పొలంలో నాట్లు వేసుకోవచ్చు. పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం, సీతంపేట, భామిని, పాలకొండ మండలాల పరిధిలో 20,314 హెక్టార్లలో ఈ ఏడాది వరి సేద్యం చేయనున్నారు. ఈ మేరకు రైతులకు 25 వేల క్వింటాళ్ల మేర విత్తనాలు అందివ్వాల్సి ఉంటుంది.

నారుమడి ఇలా ఉండాలి..

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్ట్ వేసి రెండు, మూడు సార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి. సాధారణ పంట భూమి కన్నా నారుమడులను కొంచెం ఎత్తులో తయారు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో 1 కిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ గల ఎరువును దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు విత్తిన 15 రోజుల తర్వాత మళ్లీ కిలో నత్రజని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో నారు ముదురుపోకుండా చూసుకోవాలి.
- విత్తనం చల్లిన తర్వాత మొక్క దశలో పలచగా నీరు ఉండాలి.
- మెట్ట నారుమడుల్లో ఇనుము ధాతువు లోపం అత్యధికంగా కనిపిస్తుంది. దీని నివారణకు మొక్క ఎదుగుదలను అనుసరించి రెండు నుంచి ఐదు గ్రాముల అన్నభేది, గ్రాము ఉప్పును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నాట్లు వేయడానికి ముందు నారు కొనలు తుంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చు.

నియోజకవర్గంలో సాగు వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
పాలకొండ	6,345	12,901
వీరఘట్టం	7,112	14,201
సీతంపేట	3,079	9,173
భామిని	3,778	7,549

- నారును 0.02 శాతం క్లోరోపైరిపాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకుమడత దోమను నివారించవచ్చు.
- మధ్యకాలిక రకాలను చదరపు మీటరుకు 44 కుదుళ్లు, స్వల్పకాలిక రకాలైతే 66 కుదుళ్లు ఉండేలా చూడాలి. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటుకునేటప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు ఆరు నుంచి 8 మొక్కల చొప్పున నాటు వేయాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యల ద్వారా నారు పెంచుకుంటే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యలు అధిగమించవచ్చు.

రైతులు అవగాహన పెంచుకోవాలి..



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు పట్ల రైతులు అవగాహన పెంచుకోవాలి. విత్తనాల ఎంపిక దగ్గర నుంచి నారుమడి తయారీ, నాట్లు వేసుకోవడం, పంట సంరక్షణ పద్ధతులు ఇలా అన్నింట్లోనూ చైతన్యం పొందాలి. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సూచిస్తున్న సూచనలు పాటించాలి. వరి సాగుకు సంబంధించి, కొంతమంది వెద జల్లగా, మరికొంత మంది నారుమడులు సిద్ధం చేసుకోవాలి.

–ఎస్‌ఎస్‌ఆర్‌వీ ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి, పాలకొండ

నత్తనడకన కాలువ పనులు



గేట్ వాల్ అమర్చాల్సిన సీసీ గోడ



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



పిచ్చి మొక్కలతో ఉన్న కుడి కాలువ



తామరకండి పొలాల ప్రధాన కాలువలో పూడికలు తీస్తున్న జేసీబీ

సీతానగరం:

మండలంలోని కొత్తవలస వద్ద సువర్ణముఖీ నదిపై ఉన్న సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్ కాలువ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఖరీఫ్‌కు సాగునీరు అందుతుందా, లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీతానగరం సాగునీటి ప్రాజెక్ట్‌కు సంబంధించి కుడి, ఎడమ కాలువల ద్వారా వందలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇందులో భాగంగా ప్రతిఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు కాలువ గేట్‌వాల్స్, షట్టర్లు, గొలుసులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కాలువల్లో పూడికలు తీస్తుంటారు. అయితే వేసవిలో పనులు చేయకుండా.. సరిగ్గా వర్షాలు పడుతున్న సమయంలో అధికారులు పనులు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు కొత్తవలస నుంచి బగ్గందొరవలస వరకు ఉన్న కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించారు. సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలోనే ఇంతవరకు పనులు చేపడితే.. మిగిలిన పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు సిమెంట్ ఆధారిత పనులు, కల్వర్టులు, చప్టాలను త్వరితగతిన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ సోమేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. ఓఎండ్‌ఎం గ్రాంట్ కింద రూ. 20 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. రెండు జేసీబీలతో గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.